



యాసంగి ప్రణాళిక ఖరారు

జిల్లాలో వానాకాలం సీజన్ పూర్తి కావస్తోంది. పంట ఉత్పత్తులను రైతులు విక్రయిస్తున్నారు. యాసంగి సమయం దగ్గర పడుతుండడంతో అధికారులు విత్తనాలు, ఎరువుల అవసరాలతో ప్రణాళిక ఖరారు చేశారు.

- జిల్లాలో 43,884 ఎకరాల్లో పంటలు
- అత్యధికంగా వరి, అత్యల్పంగా గోధుమ సాగు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 19 (ఆంధ్యజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వానాకాలం సీజన్ పూర్తి కావస్తోంది. పంట ఉత్పత్తులను సైతం రైతులు విక్రయస్తున్నారు. దీంతో యాసంగి సాగుకు ప్రణాళికలను వ్యవసాయశాఖ అధికారులు ఖరారు చేశారు. వానాకాలం సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలోని చెరువులు, కుంటలు, బావులు, ప్రాజెక్టులు, బోరుబావుల్లో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో యాసంగి సాగుకు అన్ని రకాల పంటలు వేసుకోవడానికి అనుకూలంగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో వివిధ పంటల సాగు అంచనా ఎరువులు అవసరాలు ఎంత, ఎలా సిద్ధం చేయాలో కార్యాచరణను వ్యవసాయశాఖ రూపొందించింది.

ఎరువుల కోసం ప్రతిపాదనలు..

జిల్లాలో యాసంగి సాగుకు అవసరమైన ఎరువుల కోసం వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. యాసంగి సాగుకు యూరియా 87,768 బస్తాలు, డీఏపీ 43,884 బస్తాలు, అవసరముంటుందని అంచనా వేశారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 43,884 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో ప్రధానంగా వరి పంటను సాగు చేయ నున్నారు. జిల్లాలో వరి పంట 21,415 ఎకరాలు, జొన్న 10,202, శనగ 6,516 ఎకరాలు, మొక్కజొన్న 2,560 ఎకరాలు, పెసర 1,530 ఎకరాలు, గోధుమలు 1,044 ఎకరాలు, ఇతర పంటలు 617 ఎకరా లలో సాగు అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

సాధారణం కంటే అధికం..

జిల్లాలో ఈ ఏడాది సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 15 మం డలాలలో అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో నీటి నిలువలు సమృద్ధిగా ఉన్నాయి. జిల్లాలో సరాసరి భూగర్భ నీటి మట్టం 9.15 మీటర్లకు చేరుకున్నంది. నీటి నిలువలు అందుబాటులో ఉండడంతో యాసంగి సీజన్‌లో వరి సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. వరితో పాటు జొన్న, శనగ ఇతర అంతర పంటలను సాగు చేయనున్నారు.

రైతులకు సూచనలు..

- శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



యాసంగి సాగులో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలను అం దిస్తున్నాం. జిల్లాలో యాసంగి పంటల సాగు ప్రణాళికలను రూపొందిం చాం. ఈ సీజన్‌లో జిల్లాలో 43,884 ఎకరాలలో సాగు విస్తీర్ణం ఉంటుందని అంచనా వేస్తున్నాం. అయా మండలాల వ్యవసాయశాఖ అధికారులు రైతు లకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరుకోవాలి



ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరెడ్డి

రెబ్బెన, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరుకోవాలని డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్ కాస్టును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను జీఎం శ్రీనివాస్‌తో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులకు సిబ్బందికి మార్గ నిర్ధేశం చేశారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాస్, పీఓ ఎం.నరేందర్, ఏరియా సెక్యూరిటి అధికారి ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, సివిల్ ఎస్‌ఇ బాషా, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలి

కెరమెరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పశుగణాభివృద్ధికి మండలంలోని పాడి రైతులు తమ పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ అన్నారు. మంగళవారం ఝరి గ్రామంలో జిల్లా పశుగణా ,దివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖల ఆధ్వర్యం లో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌డీఏ డాక్టర్ రామారావు రాథోడ్, వీఏవో సుప్రియా, గోపాల మిత్ర రమేష్ పాల్గొన్నారు.

రూరల్ ఎస్సైగా సందీప్‌కుమార్

కాగజ్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రూరల్ ఎస్సైగా సందీప్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై మహేందర్‌ను ఈసుగాం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టి), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్విని యోగం చేసుకోవాలని ఎంఈఓ వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ బాలికల పాఠశాలలో మంగళవారం మండల లెవల్ గ్రంథాలయాంను, రూం టు రీడ్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదాశివుడు, జిల్లా రూం టు రీడ్ అధికారి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కౌటాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో మెలకువలపై రైతులకు అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో వరి, పత్తి పంటలు కోసిన తరువాత పత్తి కొయ్యలు కాల్చకుండా భూమిలో కలియ దున్నడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఏవో ప్రేమలత, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎంఈవో

కౌటాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తంపేట ఉన్నత పాఠశాల విద్యార్థినులు నేషనల్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ(కరాటే)లో జాతీయ స్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించడంతో మంగళవారం ఎంఈవో హనుమంతు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు.. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్ అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మంగళవారం హైదరాబాద్‌లో సిర్పూరు నియోజవకర్గ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్, పలువురు కార్యకర్తలు కలిసి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్, ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్ సమస్యలను వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సీబీఎస్ఈ సిలబస్ ఏర్పాటు చేయాలి

రెబ్బెన, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోలేటి సింగరేణి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ ఏర్పాటుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం రవీందర్, పూదరి సాయి కోరారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, సాయి, బాలు, నాయక్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వాలీబాల్ కిట్ల పంపిణీ

రెబ్బెన, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోలేటి గ్రామంలోని పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గోలేటి ఆశ్రమ పాఠశాలలో గ్రామీణ వికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు డిక్షనరీ, గ్రంథాలయానికి సంబంధించిన బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వికాస్ సేవా సమితి సభ్యులు లావుడియా రమేష్, గుగులోతు రవి నాయక్, తిరుపతి, నాగవత్ సీతారం, రవి, బానోత్ సుభాష్, ప్రధానోపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులను నాస్ పరీక్షకు సన్నద్ధం చేయాలి

లింగాపూర్ నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. లింగాపూర్ మండలంలోని ఏల్లాపటార్ ఎంపీయూపీఎస్, పిక్లాతండా టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 4వ తేదీన నిర్వహించే నేషనల్ అచీవ్ మెంట్ సర్వే పరీక్ష కోసం 3, 6, 9వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎంఈవో వెంట జాముల్‌ధర ఉపాధ్యాయులు ప్రవీణ్, ఉత్తమ్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

జైనూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జైనూరు మార్కెట్ కమిటీ చైర్మేన్ కుడ్మెత విశ్వనాథ్, డైరెక్టర్లు పంద్ర షేకును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, నాయకులు పెందుర్ ప్రకాష్, సుద్దాల శ్రీనివాస్, సుద్దాల ఆనంద్, భుజంగ్‌రావ్, కుడ్మెత జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

చోరీ ఘటనపై విచారణ చేపడుతాం

సిర్పూర్(టి), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకులో కిటికీ పగలగొట్టి చోరీకి యత్నించిన విషయంపై సీసీ పుటేజ్‌ల ద్వారా విచారణ జరుపుతామని సీఐ రమేశ్ అన్నారు.. సోమవారం రాత్రి బ్యాంకు మేనేజర్ ముత్యంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల పుటేజ్‌లతో పాటు బస్టాండు ఏరియా, పోలీసు స్టేషన్ ఏరియా, రైల్వే స్టేషన్ ఏరియా, డొనల్ ఏరియాల్లోని సీసీ పుటేజ్‌లను పరిశీలించి నిందితుడిని పట్టుకునేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. ఆయన వెంట ఎస్సై కమలాకర్, తదితరులు ఉన్నారు.

ఎస్సై సేవలు అభినందనీయం

బెజ్జూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో ఎస్సైగా విదులు నిర్వహించిన విక్రమ్ సేవలు అభినందనీయమని ఆదివాసీ సంఘం నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఆయనను మంగళవారం ఆదివాసీ భవన్‌లో శాలువాతో సత్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ మండలంలో అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ క్రీడలలో యువతను ప్రోత్సహిస్తూ అనే సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ కార్య క్రమంలో ఆదివాసీ నాయకులు సకారాం, శంకర్, బక్కయ్య, శ్రీహరి, తిరుపతి, వెంక ట్రావు, తుకారాం, పుల్లయ్య, మహిళలు అమృత, పద్మ పాల్గొన్నారు.

అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- డిసెంబరు 7వరకు జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలు - కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 19 నుంచి డిసెంబరు 7వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనాల సముదాయంలో మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాల వాహనాన్ని ఆర్డీవో లోకేశ్వరరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి, చేయూత పెన్షన్, రైతు రుణ మాఫీ, ప్రభుత్వ ఉద్యోగ నియమకాలపై ఈ నెల 19 నుంచి డిసెంబరు 7 వరకు 19 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలోని 15 మండల కేంద్రాలు, 57 గ్రామాలు, 2 మున్సిపాలిటీల్లో నిర్వహించనున్నామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలో హైదరాబాద్ నుంచి 80 మందితో కూడిన సాంస్కృతిక కళ బృందం ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుందని తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలకు హాజరు కానున్నందున తదనగుణంగా అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్‌కుమార్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పర్యటన

సిర్పూర్(టి), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మె ల్సీ దండె విఠల్ పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కిశోర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. సమస్యలపై కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో సోహెల్ అహ్మద్, తులసీరాం, అకిల్, రాజు, మున్నాబాయ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం

రెబ్బెన, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షునిగా చిలువేరు రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సిద్దం షెట్టి ప్రకాష్, కోశాధికారిగా వెంకటేష్, యువజన సంఘం అధ్యక్షుడిగా రాచర్ల రాకేష్, ప్రధాన కార్యదర్శి పాతరాజు, కోశాధికారి సాయికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక వంశీకృష్ణ ఎన్నికయ్యారు. కోశాధికారిగా సుభాష్ ఎన్నికయ్యారు. అలాగే మహిళ సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మైలారపు అన్నపూర్ణ, కోశాధికారి ఉమాదేవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాచకొండ నాగేశ్వర్ రావును ఘనంగా సన్మానించారు. రెబ్బెన మండల వాసవి సేవా దళ్ అధ్యక్షునిగా కోట నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక వంశీకృష్ణ, కోశాధికారిగా సిద్దం షెట్టి సుభాష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంతోష్, సందీప్, రాజశేఖర్, సురేష్, చక్రపాణి, కిరణ్, సుగుణాకర్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



వాంకిడిలో పూలమాల వేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్/వాంకిడి/తిర్యాణి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి వాళులు అర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, చరణ్, గోపాల్ నాయక్ ,మునీర్, డాక్టర్ రమేష్, అసద్, గోవింద్, రఘు, ఖలీం తదితరులు పాల్గొన్నారు. వాంకిడిలో కాంగ్రెస్ నాయకులు నారాయణ, సుధాకర్, గణేష్, దాదాజీ, ప్రశాంత్, జయరాం, కిషన్ కేక్ కట్ చేసి మిఠాలు పంచారు.తిర్యాణి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేశారు.



తిర్యాణిలో..



ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జర్మనీ, నెదర్లాండ్ బృందం పర్యటన

- రైతుల ఆర్థిక స్థితిగతులపై ఆరా



ముంజిగూడలో రైతు చేనులో పత్తి ఏరుతున్న విదేశీయులు

జైనూర్/(సిర్పూర్‌యు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జైనూర్, సిర్పూర్(యు) మండలాల్లో మంగళ వారం జర్మనీ, నెదర్లాండ్ విదేశీయుల బృందం ప్రతిని ,దులు పర్యటించారు. ఈసందర్భంగా సిర్పూర్(యు) మండలంలోని ముజిగూడలో వారు చేతన్న ఆర్గానిక్ వల్ల పంట సాగులో పొందుతున్న దిగుబడి, రైతుల ఆర్థికాభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు. రైతులు పంట చేనులో పత్తి ఏరారు. సేంద్రియ ఎరువులతోనే పంటలు దిగుబడిని ఇస్తాయని, రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించా రు. నెదర్లాండ్, జర్మనీ దేశాలో రసాయనిక ఎరువుల వాడకం ఉండదన్నారు. దింతో అక్కడి రైతులు అధిక దిగుబ డులతో ఆర్థిక స్వావలంబన చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో చేతన్ అర్గానిక్ స్టెట్ కోఆర్డినేటర్ ప్రభాకర్ రైతుల కు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించి పంటల దిగుబడి సాధించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జైనూరు మండలంలోని రాసిమెట్ట ప్రభు త్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, పెన్నులను పంపిణీ చేశారు. రాసిమెట్ట ఆశ్రమోన్నత బాలికల ఆశ్ర మోన్నత పాఠశాలలో విద్యార్థినుల సాం స్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థి నులతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో డెబెల్ల ఇండియా రంగరాజన్, విలీయం అడ్రియం హెల్నిక్ స్టార్ లినెన్, కరీన్ పిన్స్ స్టా ర్ లైనెన్, కోర్నెస్ గెరార్డ్ రిజ్జబెర్క్, రినార్డస్ బెర్నర్‌డస్ ఎలెన్‌కాంప్, వొల్లర్‌వాన్ ఈజ్క్, బినాక ఉర్సులవాన్ ఎగ్మాండ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి నృతం చేస్తున్న విదేశీయులు

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కాగజ్‌నగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ రామానుజం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారంఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన వారు తప్పకుం డా లైసెన్సులు తీసుకోవాలన్నారు. మద్యం తాగి ఆటో నడుపకూడదని చెప్రాఉ. పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు. పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై డీకొండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బెల్లంపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్నాల రైల్వే గేట్ సమీపంలో మంగళవారం రైలు ఢీకొని గంగారాంనగర్‌కు చెందిన తిప్పరవేణి శ్రీను(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కన్నాల బస్తీలో ఉండే బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో రైల్వే గేట్ దాటుతుండగా రైలు ఢీకొందని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బెల్లంపల్లి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు



నిందితులను చూపుతున్న ఎస్సై మహేందర్

భీమిని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ఎదుట గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపారు. గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం రావడంతో కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఎండీ జీషాన్, కాసిపేట మండలంలోని ముత్యంపల్లికి చెందిన బాకీ గౌతమ్‌లను స్టేషన్ వద్ద పట్టుకొన్నామన్నారు. వారి వద్ద నుంచి 28 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తే కేసులు

జైపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తే కేసులు తప్పవని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పేర్కొన్నారు. మంగళవారం ఇందారం బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని యజమానులకు జరిమానాలు విధించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఉన్న చిరువ్యాపారులతో మాట్లాడారు. రోడ్లపై గప్‌చిప్‌ల బండి, బజ్జీల బండి నిర్వహించడం వల్ల ప్రజలు తమ వాహనాలు రోడ్లపై నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా యన్నారు. పండ్ల వ్యాపారాలు రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో సెలూన్ షాపు దగ్ధం

మంచిర్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఓవర్‌బ్రిడ్జి సమీపంలో గల బ్యూటీ లాంజ్ హేయిర్ సెలూన్ షాపు మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. షాపు నిర్వాకుడు శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం షాపు మూసి ఉండగా మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పొగలు వచ్చాయన్నారు. పక్కన ఉన్న మెకానిక్ షాపు వారు ఫోన్ చేసి విషయాన్ని చెప్పారని, వెంటనే షాపు వద్దకు చేరుకొని ఫైర్ అధికారులకు సమాచారం అందించగా వారు మంటలను ఆర్పివేశారని తెలిపాడు. షాపులోని ఏసీ, ఫర్నీచర్, సామాగ్రి దగ్ధమైందని, సుమారు రూ.3లక్షల వరకు నష్టం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ఆర్టీసీ సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంఘాలపై ఆంక్షలు ఎత్తి వేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. డిపో ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబరు నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలను ఎత్తి వేయాలన్నారు. తక్షణమే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీ నిర్వాహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమాచారి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రం అనుమతి రద్దు

ఆసిఫాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జైనూరు మండల కేంద్రంలో సయ్యద్ ముబారక్‌కు చెందిన మీసేవ కేంద్రం, ఆధార్ పీఈసీ కేంద్రం అనుమతులు రద్దు చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో దరఖాస్తుదా రులకు రశీదు ఇవ్వక పోవడం, ఇతర నిబంధన లు ఉల్లంఘించడం కారణంగా విచారణ జరిపి రద్దు చేశామని తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చేర్ల మురళీధర్ అన్నారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంను పురస్కరించుకుని గ్రామ గ్రామాన ముదిరాజ్ జెండాలను ఎగుర వేసి తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. నాయకులు సతీష్, రాజేష్, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణమే.. కొనుగోలు కేంద్రం..



దండేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తమామిడిపల్లి గ్రామ శివారులో కడెం ప్రధాన కాలువ సమీపంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ధాన్యం కొనుగోళ్లకే ఉపయోగపడుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండేళ్ల క్రితం ప్రతీ గ్రామ పంచాయతీకి తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంత యువకుల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ఊరికి దూరంగా ఉండడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

అద్దాల అందం

- లంబాడీ ఎంబ్రాయిడరీపై మక్కువ
- తీజ్ వేడుకల్లో తప్పనిసరిగా ధరిస్తున్న మహిళలు

నిన్నటి ఆధునిక కళ నేటి సంప్రదాయ కళ..

అంటారు. కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళితే..లంబాడా గిరిజనుల సాంప్రదాయ వస్త్రాధారణ కన్నుల పండువగా ఉండేది. ఇప్పుడు ఏక్కడో గిరిజన లంబాడా తండాలలో తప్ప సాంప్రదాయ దుస్తులు ధరించేవారు కనిపించడంలేదు . ఇక్క సాంప్రదాయ వస్త్రధారణ అనేది నిన్నటి కళేనా అనే సంశయం తలెత్తక మానదు. కాని జిల్లాలో పలు చోట్ల దీన్ని కొనసాగిస్తున్నారు. ఏజెన్సీ గిరిజన తండవాసురాలు జాధవ్ పంచి బాయి(75 ఏళ్లు) అయ్యో, మా కళలు మాకు దూరం అవుతున్నాయే అని ఒకప్పుడు నిట్టూర్చేది. కాని ప్రస్తుతం ఇప్పుడు అమెరికాలో ఉంటున్న వారు సైతం దీనిపై మక్కువ చూపుతున్నారని చెబుతున్నారు..



లింగాపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కల్చరల్ ఐడెంటిటీగా భావించే 'లంబాడీ ఏంబ్రాయిడరీ'కి మళ్లీ ప్రధాన్యం పెరిగింది. సేవాలాల్, మేరీయా, పస్నీ భవానీ పూజలు, తీజ్..మొదలైన పండుగలకు సంప్రదాయ దుస్తులు వేసుకోవడం తప్పనిసరిగా మారింది. ప్రత్యేక కార్యక్రమాల్లో సైతం సెలబ్రిటీలు కూడా బంజారా సంప్రదాయ దుస్తులు ధరిస్తున్నారు. దీంతో పలువురు వీటిని 30 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు వెచ్చించి మరీ తయారు చేయించుకుంటున్నారు. సినిమాలు ప్రవేట్ ఆల్బమ్స్ పాటల చిత్రీకరణకు ఈ దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ప్రత్యేకమైన పేర్లతో..

గిరిజన తండాల్లోని మహిళలు వేసుకోనే సంప్రదాయ దుస్తులను పేట్యి, పేట్, గంగుటో, కాంట్లీ పేటీ, పులియా, గున్నే, టుక్రి, ..ఇలా ఎన్నో ప్రత్యేక మైన పేర్లతో పిలుస్తారు. వారు ధరించే ఆభరణాలు టోట్లి (చేవులకు పెట్టుకునేవి), హస్లీ(మేడలో వేసుకునే కడియం), వాంగ్డీ, కస్సులు(కాళ్లకు వేసుకునే వంకలు), హారం (రూపాయి బిళ్లలను అతికించి వెండితో తయారు చేసే ఆభరణం) బల్యా (గాజులు) లకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పట్కారి వారు వీరికి దుస్తు లు ఆభరణాలు ఆలంకరణ వస్తువులు తయారు చేస్తుంటారు.

జాదవ్ పంచిబాయికి, జాధవ్ ప్రమీల ఉపాధ్యా యురాలికి ఎన్నో తరాల దగ్గరం ఉంది.



కలర్‌ఫుల్ దుస్తులతో.. జాదవ్ ప్రమీల, ఉపాధ్యాయురాలు

నాకు చిన్నప్పటి నుంచే మా సంస్కృతి, సంప్రదాయాలంటే ఇష్టం. మా తండాల్లో ఉత్సవాలు జరిగినప్పుడు ఆచారం ప్రకారం దుస్తులు వేసుకుంటాం. తీజ్‌తో సహా ఇతర పండుగలకు కలర్‌ఫుల్ దుస్తులతో ఆడవారు కన్పించే తీరు కన్నుల పండువగా ఉంటుంది. గిరిజన సాంప్రదాయాలు నేటి ఆచరించేలా చూడాలనేదే కోరిక. వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాల్లో సాంప్రదాయ దుస్తులు లంబాడీలు తప్పకుండా వేసుకోవాలి. అప్పుడు మన సంస్కృతి, సాంప్రదాయాన్ని పెద్దలు చూపిన మార్గాన్ని అనుసరించిన వారమవుతాం.

కాగా సంప్ర దాయ కళల వారి అభిరుచికి మాత్రం ఏలాంటి దూరం లేదు. ఒక్కరు తమ తరం కళను ఈతరంలో చూసుకోవాలను కుంటున్నారు. మరొకరు అలనాటి లంబాడీ సంస్కృతి, సాంప్రదాయ దుస్తుల కళ నేటి తరాలకు తెలిసే విధంగా ఉండాలనుకుంటున్నారు

చిన్నప్పటి నుంచే ఆసక్తి..

జాదవ్ పంచిబాయి, లింగాపూర్



చిన్నప్పటి నుంచి అమ్మనాన్న, అత్తామామాలు లంబాడీ దుస్తులు ఇంట్లో మాకు వేసుకోవడానికి తయరు చేస్తుంటే ఆసక్తి ఏర్పడింది. ఇప్పుడు నా వయస్సు 75 ఏళ్ల, ప్రస్తుతం నేను మా ఇంట్లో వాళ్లతో పాటు మా తండావాసుల మహిళలకు కూడా దుస్తులు కుట్టి ఇస్తున్నాను. నాకు పోషణకు ఇబ్బంది లేకుండా ఉంది. మరో లంబాడీల సంప్రదాయ కళను ఈతరం వాళ్లు ఇష్టపడేలా చేయడం కూడా సంతోషన్నిస్తోంది.

పులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

కెరమెరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామస్తులకు పులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై అంజయ్య, అటవీ అధికారులు అన్నారు. కెరమెరి మండలంలోని పులి సంచారం నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని టోకెన్‌మోవాడ్, బాబేఝరి గ్రామాల్లో మంగళవారం డప్పు చాటింపు చేపట్టారు. మండలంలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజ లు బయటికి ఒంటరిగా వెళ్లరాదని, పులికి హాని కలిగించ వద్దని చెప్పారు. పులి వల్ల ఎవరికీ హాని కలిగినట్లయితే నష్ట పరిహారం ఇస్తామని, పులి కనిపించినట్లయితే అటవీ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత

ఆసిఫాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో డీఈవో కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పదిహేనురోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిపి సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలు నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు మోహన్, నగేష్, సందీప్, అనూప్‌కుమార్, రాజ్‌కుమార్, రాజేష్, వెంకటరమణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌మందిర్‌లో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణేశ్ మందిర్‌లో అంగారిక చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శిరీష్ శర్మ, శ్రీనివాస్ శర్మ, నరేష్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అష్టోత్తర శతనామావళి, అభిషేకం, పుష్పార్చన, గణపతి ఉపశని శత్తులు, మంగళహారతి, మహామంత్ర పుష్పం చేపట్టారు. రాత్రి 8.28 నిమిషాల తరువాత చంద్రోదయం అనంతరం భక్తులు ఉపవాస దీక్షలు వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమ మండలి సభ్యులకు సన్మానం

ఆసిఫాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో నూతనంగా నియామకమైన ఉద్యోగుల సంక్షేమ మండలి సభ్యులు లక్ష్మణ్, అశోక్‌ను మంగళవారం డిపో మేనేజర్ విశ్వనాథ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డిపో అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి సంక్షేమ మండలి సభ్యులు పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు సిబ్బంది సరియా, ఉదయ్, శామ్యూల్, వెంకటరాజం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

వాంకిడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సూక్ష్మజీవుల వల్ల కలిగే దుష్పరిణామాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఆసుప్రతి డాక్టర్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ నెల 24 వరకు ప్రతి గ్రామంలో సూక్ష్మజీవుల వల్ల కలిగే దుష్పరిణామాలు, వ్యక్తిగత శుభ్రత పాటిన్చా యాంటిబయోటెక్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ రవిదాస్, పీహెచ్‌ఎన్ క్రిష్ణయానా పాల్గొన్నారు.

సరిహద్దుల్లో వాహనాలు తనిఖీ చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణలోకి రాకుండా ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు వద్ద వాహనాల తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని వాంకిడి మండలంలోని రాష్ట్ర సరిహద్దు వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అదనంగా ఇస్తున్నందన తనిఖీ చేపట్టాలని సూచించారు. జిల్లా నుంచి పత్తితో వెళ్లె వాహన పత్రాలు క్షుణ్ణంగా పరిశీ లించాలన్నారు. అనుమతి లేని వాహనాలను నియంత్రించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, ఎస్సై ప్రశాంత్, సిబ్బంది ఉన్నారు.

- నాణ్యమైన భోజనం పెట్టాలి..

ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన భోజనం పెట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను



చెక్ పోస్టు వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, గదులు, వంటశాల, మూత్రశాలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, పాఠశాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని తెలిపారు. మెనూ ప్రకారం సకాలంలో ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులు వినియోగించాలని, కాలం చెల్లిన వస్తువులను వినియోగించినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల ఆవరణలో మురికి నీరు లేకుండా పర్యవేక్షించాలని, విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందించాలని చెప్పారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ శాఖాధికారి రమాదేవి, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎస్సై ప్రశాంత్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



సొంతింటి కల సాకారం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, నవంబరు 19(ఆంధ్యజ్యోతి): సింగరేణిలో కార్మికుల చిరకాల కోరిక అయిన సొంతింటి కలకు సంబంధించి యాజమాన్యం ప్రణా ళికలను సిద్ధం చేయాలని, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్ అన్నారు. ఏరియాలోని వర్క్‌షాపులో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఈ నెల 28న కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో స్ట్రక్చరల్ సమావేశం జరగనుందని తెలిపారు. యాజమాన్యమే పన్నులు చెల్లించామని కోరుతామన్నారు. సమావేశంలో నాయకులు శర్మ, ఎగ్గెటి రాజేశ్వర్‌రావు, భూమయ్య, భానయ్య, వేణు, శ్రీనివాస్, రాజయ్య, పైడి పోషాలు, వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఏరియా వర్క్‌షాపులో నెలకొన్న ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సంబంధిత సమస్యలపై ఇన్‌చార్జి డీజీఎం కృష్ణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం గని కమిటీ ఏర్పాటు

శ్రీరాంపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎస్ఆర్‌పీ 1 గని కమిటీని మంగళవారం నియమించారు. సంఘం బాధ్యులు మోత్కూరి కొమురయ్య, పెట్టం లక్ష్మన్, బి. మారుతి, బద్రి బుచ్చయ్య ఆధ్వర్యంలో కన్వీనర్‌గా కురుమ వికాస్, కో-కన్వీనర్‌గా తస్నీరు రవీందర్‌ను నియమించారు. సమర్థవంతమైన కార్యనిర్వహణ, బీసీ కులానికి రావాల్సిన హక్కులు, సౌకర్యాలు, అభివృద్ధి గురించి ఐక్యంగా పోరాడాలని, త్వరలో నిర్వహించబోయే మహాసదస్సును విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధ నకు కృషి చేయాలని జీఎం(కో-ఆర్డినేషన్) సుభాని అన్నారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి జీఎం కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు, బొగ్గు రవాణా, ఓబీ వెలికితీతపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాంగణంలో ఉన్న సీహెచ్‌పీ నుంచి మూడు రేకల బొగ్గు రవాణా చేయాల న్నారు. ఏరియాలోని ఓసీపీలు, అండర్ గ్రౌండ్ గనుల నుంచి లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం టి. శ్రీనివాస్, ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, ఇందారం ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఎస్ఆర్‌పీ 1, 3 గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్ రావు, ఆర్కే 5 మేనేజర్ సుధీర్‌కుమార్ ఝా, గని రక్షణాధికారి శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

జైపూర్: ఎస్‌టీపీపీలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ప్లాంటు పనులను త్వరగా పూర్తిచేయాలని జీఎం (కో-ఆర్డినేషన్) సుభాని అన్నారు. మంగళవారం ప్లాంటు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం హైడ్రోజన్ ప్లాంటును సందర్శించి, హైడ్రోజన్ ఉత్పత్తి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈడీ ఎన్ వీ రాజశేఖర్ రావు, అధికారులు ఉదయ్, శ్రీనివాసులు, మదన్‌మోహన్, చంద్రమణి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఓసీపీని పరిశీలిస్తున్న సుభాని

మెడికల్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

శ్రీరాంపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్, మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయిన ఉద్యోగులు మూడు నెలల్లోగా మెడికల్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ కార్డులు కావాల్సిన వారు తాము పనిచేసిన గనులు, విభాగాలలో సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బొగ్గు నాణ్యతపై క్విజ్ పోటీలు

శ్రీరాంపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బొగ్గు నాణ్యతపై శ్రీరాంపూర్ ఓసీపీలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గని ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, క్వాలిటీ ఇన్‌చార్జి కమ్రుద్దీన్, ఏఐటీయూసీ సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, పిట్ కార్యదర్శి లచ్చన్న, అధికారులు శ్యాం సుందర్, శంకర్, జలాలుద్దీన్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఆగయ్యకు కార్ల్‌మార్క్స్ నేషనల్ అవార్డు



ఏబూసి ఆగయ్య

శ్రీరాంపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా విప్లవ, సామాజిక ఉద్యమకారుడిగా, పాత్రికేయుడిగా, సింగరేణి కార్మిక సంఘం నాయకుడిగా సేవలు అందిస్తున్న, తెలంగాణ సామాజిక ఉద్యమకారుడుగా పనిచేసిన ఏబూసి ఆగయ్యను కార్ల్‌మార్క్స్ నేషనల్ అవార్డు వరించింది. బహుజన సాహితీ అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పత్రాన్ని ఆగయ్యకు హైదరా బాద్‌లోని బీఎస్‌ఏ కార్యాలయంలో అందజేశారు. ఈ అకాడమీ ద్వారా యేటా ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, దళిత శ్రామిక హక్కుల కోసం పనిచేస్తున్న వారికి అందిస్తున్నామని తెలిపారు. డిసెంబరు 15న ఢిల్లీలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి చేతులమీదుగా ఆగయ్యకు అవార్డును అందించనున్నట్లు రాధాకృష్ణ వివరించారు.

'యాజమాన్యం నిర్లక్ష్యం సరికాదు'

శ్రీరాంపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సింగరేణి యాజమాన్యం ఉద్యోగులకు గరం కోట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడ సరికాదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియ న్(సీఐటీయూ) బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ అన్నారు. ఎస్ఆర్‌పీ 3 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెల్మెట్ లేకపోతే డ్యూటీకి అనుమతించకపోవడం ఎలా చేస్తున్నారో అలాగే రం కోట్లు లేకుంటే డ్యూటీకి రానీయవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు తోడె చంద్రశేఖర్, ఆర్గనైజర్ సాయిల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో మాట్లాడుతున్న సురేష్ ఆత్మారాం మహరాజ్

జైపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేలాల గట్టు మల్లన్న స్వామి గట్టు మల్లన్న స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని చిలుకూరి బాలాజీ శివాలయం అర్చకుడు సురేష్ ఆత్మారాం మహరాజ్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. భక్తులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ శివనామ స్మరణతో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. మొదటిసారిగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడంతో జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఏసీపీ వెంకటేశ్వర్, తహసీల్దార్ వనజారెడ్డి, సీఐ వేణుచందర్, ఎస్ఐ శ్రీధర్, ఎంపీడీవో సత్యనారాయణ, వేలాల గ్రామ ప్రత్యేకాధికారి విద్యాసాగర్, వేలాల ఈవో రమేష్ పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

గర్మిళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని ఉపాధి కార్యాలయంలో ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి అధికారి ఎం.రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆదర్శ ఆటోమెటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పోస్టుల భర్తీ కోసం మేళా జరుగుతుందని, 8 రిలేషన్ మేనేజర్ పోస్టులు, 2 సీనియర్ రిలేషన్ షిప్ మేనేజర్, 2 ట్రూ వాల్యు డిపార్ట్‌మెంట్ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. అభ్యర్థులు 20-32 యేండ్ల మధ్య ఉండాలని, డిగ్రీ పూర్తి చేసి టూ వీలర్, ఫోర్ వీలర్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. బయోడేటా, ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో జాబ్‌మేళాకు హాజరు కావాలని, వివరాలకు సెల్ : 8121009065, 9110368501 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్థికసాయం

దండేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కట్ట హనుమయ్య కుమారుడు సుధాకర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం కళ్యాణిఅశోక్ ఆధ్వర్యంలో దాతల సహాయంతో రూ.5 వేలను మంగళవారం కుటుంబసభ్యులకు అందజేశారు. రవితేజ, మల్లేష్ పాల్గొన్నారు.

వేద ఘోష..

- అచ్చలాపూర్‌లో మహాదేవ వేదపాఠశాల ఏర్పాటు
- 53 ఏళ్లుగా ఉచిత విద్యాబోధన
- సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణే ధ్యేయం
- పౌరోహిత్యంతో ఉపాధి



తాండూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేదాలు, ఉపనిత్తులు భారతీయ సనాతన ధర్మానికి మూల స్తంభాలు. జ్ఞాన సంపదకు, భారతీయ జీవన విధానానికి, సంస్కృతీ సాంప్రదాయాలకు మూలాధారాలు. అలాంటి వేదం కనుమరుగు కాకుండ భావితరాలకు అందించేందుకు కృషి చేస్తోందని అచ్చలాపూర్ గ్రామానికి చెందిన మహాదేవ వేద పాఠశాల. ఇక్కడ నిత్యం వినిపించే వేద శబ్దాలు మనసుకు ప్రశాంతత చేకూరుస్తాయి. వేదం నేర్పుతూ ఎంతో మంది విద్యార్థులను వేద పండితులుగా తీర్చిదిద్దుతోంది. గుంటూరు జిల్లాకు చెందిన గరికపాటి మహాదేవ శాస్త్రి అచ్చలాపూర్‌లో వేదపాఠశాలను ఏర్పాటు చేయాలనే సంకల్పం కలిగింది. తాండూర్ మండలం అచ్చలాపూర్‌లో 1952లో మహాదేవ వేద పాఠశాలను ప్రారంభించారు. గ్రామస్థుల సహకారంతో ఏర్పాటైన పాఠశాల 1971లో మహాదేవ శాస్త్రి శిష్యుడైన అచ్చలాపూర్ గ్రామానికి చెందిన దుద్దిళ్ల మనోహర అవధాని పాఠశాల బాధ్యతలను తన భుజాలపై వేసుకున్నాడు. పూరి గుడిసెలో ఉన్న పాఠశాలను అంచెలంచెలుగా దాతల విరాళాలతో అభివృద్ధి చేశారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మహారాష్ట్రలోని చంద్రాపూర్, సిరొంచ నుంచి వచ్చిన విద్యార్థులు వేద విద్యను నేర్చుకుంటున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 25 మంది విద్యనభ్యసిస్తున్నారు.



ఎక్కడ కార్యక్రమాలున్నా ఇక్కడి వారే..

ఉత్తర తెలంగాణలో పూజా క్రతువులు, యాగాల్లో అచ్చలాపూర్ వేద పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పాల్గొంటారు. మాజీ సీఎం కేసీఆర్ ఆయుత చండీయాగం మొదలుకొని, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో నిర్వహించిన గణపతి నవరాత్రుల్లో అచ్చలాపూర్ విద్యార్థులే పూజా క్రతువుల్లో పాల్గొన్నారు.

కృష్ణ యజుర్వేద పాఠశాల..

ఇక్కడి పాఠశాల కృష్ణ యజుర్వేదం బోధిస్తోంది. వేదాలలో మొదటిది ఋగ్వేదం.. రెండోది యజుర్వేదం..మూడవది అధర్వణ వేదం.. నాల్గవది సామవేదం. యజుర్వేదంలో రెండు శాఖలుంటాయి. ఒకటి శుక్ల యజుర్వేదం కాగా రెండోది కృష్ణ యజుర్వేదం. ఇక్కడి పాఠశాలలో కృష్ణ యజుర్వేదం బోధిస్తారు. కృష్ణ యజుర్వేదం 12 ఏళ్ల కోర్సు. అనంతరం తిరుమల తిరుపతి, రాజమండ్రి తదితర ప్రాంతాలలో పరీక్షలకు హాజరై సర్టిఫికెట్స్‌ల ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక కావచ్చు. వేద విద్యనే కాకుండా ఇక్కడి పాఠశాలలో స్మార్త విద్యనూ నేర్పుతారు.

స్మార్త విద్యార్థులకు కర్మ కాండలు, గృహప్రవేశాలు తదితర బోధన చేస్తారు. స్మార్తం అనేది మనిషి పుట్టుక నుంచి చనిపోయే వరకు జరిగే షోడశ కర్మల కార్యక్రమాలకు స్మార్తం ఎంతో ఉపయోగపడుతుంది. ఇక్కడి వేద పాఠ శాలలో స్మార్తం నేర్చుకున్న వందల మంది విద్యార్థులు అర్చకులుగా విధులు నిర్వహిస్తున్నారు. స్మార్త విద్య ఐదేళ్ల పాటు నేర్పుతారు. గోవులను రక్షించాలనే ఉద్దేశ్యంతో 2012లో గోశాలను ఏర్పాటు చేశారు.

ఉచిత భోజనం, వసతి

ఇక్కడి పాఠశాలలో వేదం నేర్చుకునే విద్యార్థులకు ఉచితంగా భోజన, వసతి కల్పిస్తారు. రోజు ఉదయం 4 గంటలకు లేచి సంధ్యావందనం, నిత్యకృత్యానుష్ఠానాలు చేసుకొని 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 6 నుంచి 8 గంటల వరకు విద్యాబోధన జరుగుతుంది. ఇక్కడి పాఠశాలలో వేదాలతోపాటు శుభ కార్యాలకు ఉపయోగపడే పౌరోహిత్య సాధన నేర్పుతారు. అగ్ని కార్యం, బ్రహ్మయజ్ఞం నిత్యం ఆచరిస్తారు. పక్షానికి ఒకసారి మాత్రమే తల్లిదండ్రులను కలుసుకునే అవకాశం ఉంటుంది. అమావాస్య, పౌర్ణమి, పాడ్యమి రోజుల్లో సెలవు ఇస్తారు. మహాదేవ వేద పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. ఇక్కడ చదివిన విద్యార్థులు 20 మంది ఉద్యోగులుగా దేవాదాయశాఖలో విధులు నిర్వహిస్తున్నారు. పలు వురు రాష్ట్రంలోనే కాక విదేశాల్లో కూడా అర్చకులుగా చేస్తున్నారు.

ప్రాచీన వేదవిద్య అంతరించకూడదనే...

దుద్దిళ్ల మనోహర అవధాని



ప్రాచీన వేద విద్య అంతరించి పోకుండా ఉండేం దుకు సనాతన ధర్మాన్ని కాపాడేందుకు సంకల్పంతో ముందుకు సాగుతున్నా. పాఠశాలకు దాతల సహకారం శృంగేరి పీఠాధిపతుల సహకారంతో నడుపుతున్నా. దాతల సహకారం మరింత అందించి నట్లయితే నాలుగు వేదాలను బోధించడానికి కృషి చేస్తాము.

క్రమశిక్షణ నేర్చుకున్న

గంగు మణికంఠశర్మ, వరంగల్



అచ్చలాపూర్ వేద పాఠశాలలో చదివి మంచి క్రమశిక్షణ నేర్చుకున్నాను. వరంగల్ వేయి స్థంబాల దేవాలయంలో వేద పారాయణం చేస్తున్నాను. అచ్చలాపూర్ పాఠశాల అంటే ఎంతో అబిమానం. అక్కడ చదివినందుకు గర్వపడుతున్నాను.

ఉద్యోగం చేస్తున్నాను..

పెండ్యాల లక్ష్మీప్రసాద్ శర్మ, అచ్చలాపూర్



అచ్చలాపూర్ వేద పాఠశాలలో 12 ఏళ్ల పాటు విద్య నేర్చుకున్నా. అనంతరం వేద విద్య పట్టాను పొంది సికింద్రాబాద్ మహంకాళి దేవాలయంలో వేద పారాయణం ఉద్యోగం పొందాను. చాలా ఆనందంగా ఉంది.

భవిష్యత్తుకు భరోసా...

అవునూరి మణిదీప్ శర్మ, హసన్‌పర్తి, వరంగల్



మాది మధ్యతరగతి కుటుంబం. వేదం నేర్చుకోవ డం వల్ల భవిష్యత్తు భరోసా ఉంటుందని నేర్చుకుం టున్నాను. అనంతరం ఆలయంలో అర్చకత్వం కోసం ప్రయత్నిస్తా. వేదం జీవనోపాధి కల్పిస్తుందని నేర్చుకుంటున్నా. పౌరోహిత్యం చేయాలనేది నాకు ఆసక్తి.



అచ్చలాపూర్‌లో వేద పాఠశాల భవనం

ముహూర్తం ఖరారు..

(5వ పేజీ తరువాయి..)

ఆసుపత్రులకు అనువైన స్థలం...

ఐబీ సమీపంలో ఆసుపత్రుల నిర్మాణానికి కేటాయించిన స్థలం అన్ని విధాలా అనువైనదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఎంపిక చేసిన స్థలానికి ఎదురుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉండటం, వైద్యం కోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటుందని అప్పటి అధికారులు సైతం అభిప్రాయపడ్డారు. పైగా పట్టణంలోని ప్రధాన చౌరస్తా వద్ద ఉండటంతో బస్సుల్లో ప్రయాణించే వారికి సౌకర్యవంతంగా ఉండనుంది. బస్సు దిగిన వెంటనే ఆసుపత్రిలో అడుగుపెట్టే వెసులుబాటు ఉండనుంది. పైగా రెండు ఆస్పత్రులకు నడుమ జాతీయ రహదారి ఉండటంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే నిత్యం బిజీగా ఉండే రోడ్డు దాటకుండానే అవసరమైన చికిత్సలు పొందే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

హాజరుకానున్న మంత్రులు....

ఈ నెల 21న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎంసీ హెచ్‌కు పలువురు రాష్ట్ర మంత్రులు శంకుస్థాపన చేయ నున్నారు. ఇందు కోసం స్థలాన్ని చదును చేసి, స్టేజీ ఏర్పాట్లు చేస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ఫ్యామిలీ వెల్ఫేర్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి అనసూయ (సీతక్క), ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు హాజరవుతుండగా, సుమారు నాలుగు వేల మందిని తరలించేందుకు నాయకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వేదిక, బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, పట్టణ, రూరల్ సీఐలు ప్రమోద్‌రావు, ఆకుల అశోక్‌లు పరిశీలించారు.

గణపతి ఆలయంలో హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

శ్రీరాంపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ లక్ష్మీ గణపతి ఆలయంలో మంగళవారం హోమం, మధురాభిషేకం నిర్వహించారు. సంకట హర చతుర్థి పురస్కరించుకొని 108 కిలోల తేనెతో స్వామివారికి మహా మధురాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతిరావు, ప్రధానార్చకులువంశీకృష్ణశర్మ, భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే



కీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జోనల్ మీట్‌లో ప్రతిభ కనబర్చిన కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడాకారులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం అభినందించారు. నవంబరు 11 నుంచి 14 వరకు జోన్ 1 కాళేశ్వరం, ములుగు జిల్లాలో నిర్వహించిన 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో 20కి పైగా మెడల్స్ సాధించారు. అండర్ 14 లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచే విధంగా ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్, పీడీ హరీష్, పీఈటీ రాజేందర్‌లను అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న నీరటి రాంప్రసాద్

మంచిర్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, అలాగే ప్రస్తుత దరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్స్ పెంచాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం ప్రజాపాలన విజయోత్సవ సభలు ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని, పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయన్నారు. 14లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.4వేల కోట్ల వరకు ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఇంతవరకు చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. జిల్లా నాయకులు ఆశిష్, ఆమోఘ్, తిరుపతి, నగేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

సహారా కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా



కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

మందమర్రి టౌన్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహారా ఇండియా కార్యాలయం వద్ద మంగళవారం డిపాజిట్ చేసిన బాధితులు ధర్నా నిర్వహించారు. సహారా కార్యాలయ మేనేజర్ ఎస్వీరావు, ఏజెంట్ పీఎస్ రావులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 సంవత్సరాల క్రితం లక్షల రూపాయలు డిపాజిట్లు చేయించారని, కాలపరిమితి ముగిసినా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. కష్టపడి సంపాదించిన సొమ్మును సహారా ఇండియాలో పెడితే డబ్బులు తిరిగి రాక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని తెలిపారు. మరో నెల రోజుల్లో డబ్బులు చెల్లించకుంటే ఉమ్మడి ఆత్మహత్యలు తప్పవని పేర్కొన్నారు.

మాతృమూర్తులకు పాదాభివందనం



మాతృమూర్తుల పాదాలు కడుగుతున్న విద్యార్థినులు

గర్మిళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లిలోని ఎస్ఆర్‌కేఎం కళాశాలలో మంగళవారం మాతృమూర్తులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే వారి తల్లుల పాదాలను కడిగించారు. కళాశాల చైర్మన్ గోనె శ్యాం సుందర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు మాతృమూర్తుల గొప్పతనాన్ని తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎస్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ డాక్టర్ చంద్రమోహన్ గౌడ్, కరస్పాండెంట్ పి.తిరుపతి, ప్రిన్సిపాల్ ఏ.ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల జిల్లా కమిటీ ఏర్పాటకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ మంగళవారరం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కుల నియమావళి-2018, దివ్యాంగుల హక్కుల చట్టం-2016 అనుసరించి జిల్లా కమిటీ ఏర్పాటు ఉంటుందని తెలిపారు.

గోదావరి తీరం.. అపరిశుభ్రం



మంచిర్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణ సమీపంలో ఉన్న గోదావరి తీరంలో అపరిశుభ్రం నెలకొంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, కొబ్బరికాయ ముక్కలు, దుస్తులు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వాగుల ద్వారా డ్రైనేజీ నీరు నదిలో కలుస్తుండడంతో నీరు కలుషితమవుతోంది. నదిలో పుణ్యస్నానం ఆచరించే పరిస్థితి లేకుండ దుర్గంధం, అపరిశుభ్రత నెలకొంది. గోదావరి తీరంలో చెత్తాచెదారం లేకుండా, కాలుష్యకోరల్లో చిక్కుకోకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలు కూడా బాధ్యతగా నది తీరాన్ని అపరిశుభ్రంగా చేయకుండా ఉంటేనే భవిష్యత్తు తరాలకు కాలుష్యరహిత తాగునీరు అందుతుందని పలువురు పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

కాలుష్యం కాకుండా చూడాలి

పద్మ సందేశ్ గుప్తా



గోదావరి నది కాలుష్యం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పట్టణంలోని చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి గోదావరి నదీ తీరంలో పడేస్తున్నారు. స్నానాలు చేసేటప్పుడు షాంపు కవర్లు, కవర్లు, కుంకుమ, పసుపు ప్యాకెట్ల అక్కడే పడేస్తున్నారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి నదీ తీరంలో చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలి.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

బెల్లంపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వర్గీయ ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. మహిళా శక్తికి మార్గదర్శిగా నిలిచిన మహోన్నత నాయకురాలు ఇందిరాగాంధీ అని, పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో చట్టాలను తెచ్చారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, పట్టణ అధ్యక్షుడు మాచర్ల మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దండేపల్లి (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి కోరారు. దండేపల్లిలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కల వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, ముత్తె రాజన్న, ఆకుల రాజేందర్, గంగాధర్, లక్ష్మీనారాయణ, రాజునాయక్, ఉదయ్, నవీన్, అల్లుబాయి, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నాయకులు, పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్‌లు నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలను కొనియాడారు. మహంత్ అర్జున్ కుమార్, ఎండి హఫీజ్, వడ్లూరి సునీల్ కుమార్, సుకూర్, పాషా, మంకు రమేష్, నర్సోజి, కడార్ల శ్రీనివాస్, ప్రభాకర్, కిరణ్, సట్ల సంతోష్ పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో సంబరాల్లో ఎమ్మెల్యే వినోద్, మంచిర్యాలలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయికుంటలో గల ఇందిరాగాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి పాల్గొన్నారు.



అద్దాల అందం

- లంబాడీ ఎంబ్రాయిడరీపై మక్కువ
- తీజ్ వేడుకల్లో తప్పనిసరిగా ధరిస్తున్న మహిళలు

6



వేద ఘోష

- అచ్చలాపూర్‌లో మహాదేవ వేదపాఠశాల ఏర్పాటు
- 53 ఏళ్లుగా ఉచిత విద్యాబోధన
- సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణే ధ్యేయం
- పౌరోహిత్యంతో ఉపాధి

7



అగ్నికార్యం నిర్వహిస్తున్న వేద విద్యార్థులు

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు...

- ర్యాలీ గడ్‌పూర్‌లో 13.1 డిగ్రీలు నమోదు
- రాత్రివేళల్లో పంజా విసురుతున్న చలి



మంచిర్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి పంజా విసురుతోంది. రాత్రి వేళల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. ఐదారు రోజులుగా ఉష్ణోగ్రతల్లో క్రమంగా మార్పులు చోటు చేటుచేసుకుంటున్నాయి. సాయంత్రం నుంచే వాతావరణం పూర్తిగా చల్లబడుతోంది. చలికి తోడు ఈదురుగాలులతో ప్రజలపై దాని ప్రభావం అధికంగా ఉంటుంది. పగటి వేళల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. మంగళవారం హాజీపూర్ మండలం ర్యాలీ గడ్‌పూర్‌లో 13.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జన్నారం మండల కేంద్రంలో 13.6 డిగ్రీలు, తపాల్‌పూర్‌లో 13.8, వేమనపల్లి మండలం నీల్వాయిలో 14.4, కాసిపేట మండలం కొండాపూర్‌లో 14.5 డిగ్రీలు, భీమారం మండల కేంద్రంలో 14.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

న్యూస్ బాక్స్

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం ఇస్తున్న జనసేన నాయకులు

మందమర్రి టౌన్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి మాయ రమేష్ మాట్లాడుతూ 5వ వార్డు నుంచి జిల్లా పరిషత్ పాఠశాల వరకు చేపడుతున్న రోడ్డు పనుల్లో గోదావరి ఇసుక వాడడం లేదన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీమా పథకాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్

శ్రీరాంపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు అందించే బీమా పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ మేనేజర్ నరసింహస్వామి అన్నారు. టీజీబీ ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై సుందరయ్య కాలనీలో అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా 20 లక్షల రూపాయల ప్రమాద బీమా, అటల్ పెన్షన్ యోజన, మొబైల్ బ్యాంకింగ్, రూపే కార్డు ద్వారా యూపీఐ లావాదేవీలు, ఆధార్ అనుసంధానం చేసుకొని డబ్బులు పొందే విధానంపై వివరించారు. టీజీబీ దిశ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచి సేవింగ్స్ అకౌంట్స్ తీసుకోవచ్చన్నారు. పంట, బంగారం తాకట్టు, మహిళా సంఘాల రుణాలపై తెలియజేశారు. మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్ నాగరాణి, అధ్యక్షురాలు రమాదేవి, లావణ్య, సులోచన, కనకతార, లక్ష్మీ, కవిత, వాణి, ఇతర మహిళలు, ప్రజలు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారు..

- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులకు రేపు శంకుస్థాపన
- హాజరుకానున్న మంత్రులు
- ఇక్కడే మాతా, శిశు ఆరోగ్య కేంద్రం
- రూ. 324 కోట్ల అంచనాతో భవన నిర్మాణం
- ఏర్పాట్లను పరిశీలించిన పోలీసు అధికారులు



భవన నిర్మాణం కోసం చదును చేసిన స్థలం



సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనం నమూనా

రూ. 324 కోట్ల అంచనా వ్యయంతో...

ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామన్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు హామీలో భాగంగా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ. 324 కోట్ల అంచనా వ్యయంతో ఏడు అంతస్థులతో ఆసు పత్రి భవన నిర్మాణం చేపట్టనున్నారు. ఇటీవల తెలం గాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ నిధులు కేటా యించారు. దీంతో ఆసుపత్రి నిర్మాణానికి మార్గం సుగ మం కాగా గరిష్ఠంగా మూడేళ్లలో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో యంత్రాంగం ఉంది. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంతో మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

మంచిర్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్మించతలపెట్టిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి ముహూర్తం ఫిక్స్ అయింది. ఈనెల 21న ఆసుపత్రుల నిర్మాణానికి రాష్ట్ర మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలోని పాత ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి అధికారులు స్థలం ఎంపిక చేశారు. గతంలో ఆ స్థలంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణం, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, అతిథిగృహం, ఆర్డీవో కార్యాలయాలను కూల్చివేశారు. ఆర్డీవో, ఆర్‌అండ్‌బీ కార్యాలయాలను స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీ స్‌కు తరలించారు. ఆసుపత్రుల భవన నిర్మాణాల కోసం ఇప్పటికే స్థలాన్ని వైద్య ఆరోగ్యశాఖకు రెవెన్యూ అధికారులు అప్పగించారు. తెలంగాణ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ తొలి విడుతగా రూ.50 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ సెప్టెంబరు 12న జీవో 546ను కూడా విడుదల చేసింది.

ఎంసీహెచ్ కూడా అక్కడే....

ప్రస్తుతం గోదావరి సమీపంలో ఉన్న మాతా, శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)ను కూడా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలోకి మార్చనున్నారు. ఈ మేరకు ఆస్పత్రి ప్రాంగణంలో ప్రత్యేక భవన నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎంసీహెచ్ రెండు ఒకే ప్రాంగణంలో ఉండడంతో రోగులకు వైద్యసేవల పరంగా అందుబాటులో ఉండనున్నాయి. ఎంసీహెచ్ గోదావరి సమీపంలో ఉండటంతో వరాకాలంలో యేటా వరద ముంపునకు గురవుతోంది. దీంతో అక్కడ చికిత్స పొందే గర్భిణిలు, బాలింతలతో పాటు చిన్నారులను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

మిగతా7లో

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్, రోటిగూడ, పొన్కల్, రేండ్లగూడ, దేవునిగూడ, కవ్వాల్, మొర్రిగూడ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతు అభివృద్ధికి రెండు లక్షల రుణమాఫీ ప్రకటించిన ఘనత కాంగ్రెస్‌ది అన్నారు. కిష్టాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉప కేంద్రాల ద్వారా మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కవ్వాల్ గ్రామంలో ఇటీవల మరణించిన జునుగురి ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఏవో సంగీత, ఏఈవో అక్రం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్‌అలీ, నాయకులు పసివుల్లా, అల్లం రవి, సయ్యద్ ఇస్సాక్, ఇందయ్య పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లడానికి ప్రభుత్వం నిరంతరంగా శ్రమిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని, ఉచిత బస్సు, కరెంటు, రుణ మాఫీ, స్వయం సహాయక సంఘాలకు నిధులతో పాటు ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందన్నారు.

ఆశా కార్యకర్తల వినతి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు మండల ఆశా కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ నెలకు రూ.18 వేల వేతనం అందజేయాలని, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం పోస్టులు సంబంధించిన ఆశాలకు వెయిటేజ్ మార్కులు ప్రకటించాలని వినతి పత్రం అందజేయగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

పారిశుధ్యం లోపించకుండా
ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశపాండేతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతతోపాటు నివాస ప్రాంతాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పని సరిగా నిర్మించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అనంతరం కర్ణమామిడిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. నాణ్యమైన ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు 500 బోనస్ ఇస్తోందన్నారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయాలన్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టిన తర్వాత కేంద్రాలకు తీసుకవచ్చి విక్రయించాలన్నారు. కేంద్రాలలో మౌలిక వసతులు నీడ, తాగునీరు, గన్నిసంచు, టార్పాలిన్లు కవర్స్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గూడెంలో భక్తుల రద్దీ

దండేపల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు కార్తీక పూజలను నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వ్రతాన్ని ఆచరించారు. ధ్వజ స్తంభం, రావి చెట్టు వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో ఆలయం వద్ద భక్తులతో కార్తీక శోభ సంతరించుకుంది.

బాల్య మిత్రుడికి బాసటగా

దండేపల్లి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సింగం వెంకటేష్ తల్లి రాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో తాళ్ళపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2013-14లో చదివిన పదో తరగతి బ్యాచ్ మిత్రులు వెంకటేష్ కుటుంబానికి మంగళవారం రూ. 20వేల ఆర్థిక సాయం అందించారు.

విద్య, వైద్యం, సాగు రంగాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే వినోద్‌ను సన్మానిస్తున్న జోగాపూర్ గ్రామస్తులు

నెన్నెల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్య, వైద్యంతోపాటు సాగు నీటి రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత మంగళవారం స్వగ్రామం నెన్నెల మండలం జోగాపూర్ వచ్చారు. ఆయనను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వంతో చర్చించి పలు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్టు చెప్పారు. మత్తడివాగు ప్రాజెక్టులో పూడిక చేరడంతో నిల్వ సామర్థ్యం తగ్గి రెండు పంటలకు సరిపడ నీరు ఉండడం లేదన్నారు. పూడిక తీత, కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామీణ పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు మండలంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పదిమంది పిల్లలకు నగదు ప్రోత్సాహకం ఇస్తానని ప్రకటించారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ కోదండరాం సూచన మేరకు ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తానన్నారు. మత్తడివాగు ప్రాజెక్టు మరమ్మతుకు మంత్రితో చర్చించి నిధులు తీసుకొస్తానన్నారు. జేఏసీ కన్వీనర్ టి. రణవీర్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, గురునాథం మల్లాగౌడ్, రాజన్నయాదవ్, సింగతి తిరుపతి, చెన్నోజి శంకరయ్య, హేమలత, ఉయ్యాల మల్లిక పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

జైపూర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సహ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కోదండరాం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మద్దుల సునీత, ప్రధానోపాధ్యాయులు శ్యాంసుం దర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు కల్పించిందని ఆయన గుర్తు చేశారు. గత పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేయడం వల్ల సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో రైతుల సమస్యలు మొదట పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పాఠశాల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే వివేక్ సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ, నాయకులు పాల్గొన్నారు.

కోదండరాంకు స్వాగతం

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కోదండరాంకు తెలంగాణ ఉద్యమకారులు ఘన స్వాగతం పలికారు. జేఏసీ నేత హెచ్ రవిందర్, సుందిల్ల రాజయ్య, సిరిపురం మల్లయ్య, ఎం శ్యాంసుందర్‌రెడ్డి, చందులు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబెట్టిన తర్వాతనే తీసుకురావాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

దండేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని అదనపు కలెక్టర్ మోతీ లాల్ రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ద్వారక రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పొలం కోతకు 15 రోజుల ముందే నీటి తడిని నిలిపివేయా లన్నారు. పంట ఎండిన తర్వాతనే కోయాలన్నారు. మంచు కురిసే సమ యంలో కోస్తే గింజలు మెత్తబడి ధాన్యం నలుపెక్కుతుందన్నారు. హార్వెస్టర్ స్పీడ్ 18 నుంచి 20 ఆర్‌పిఎం ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన మాట్లాడుతూ ధాన్యం ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేం ద్రానికి తీసుకవస్తే ప్రభుత్వ మద్దతు ధర పొందవచ్చున్నారు. డీసీఎస్‌వో బ్రహ్మారావు, డీఎం శ్రీకళ, ఇన్‌చార్జీ ఏడిఏ సురేఖ, తహసీల్దార్ సంధ్యరాణి, మండలవ్యవసాయ శాఖ అధికారి అంజిత్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.